telangana chowrastha.com
epaper.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:303

24 క్యారెట్లు 1,54,950.00 | కిలో వెండి 2,55,000.00 | CHOWRASTHA DIGITALS | 26.05.2026 మంగళవారం, హైదరాబాద్



## రైతులకు రూ.50వేల రుణమాఫీ

- తమిళనాడు సీఎం విజయ్ సంచలన నిర్ణయం
- 14 లక్షల మంది రైతులకు నేరుగా ప్రయోజనం
- అదనంగా ప్రభుత్వంపై 2,044.46 కోట్ల ఆర్థిక భారం
- సాగు రంగానికి సరికొత్త ఊతం
- సోమవారం వ్యవసాయ,ఆర్థిక శాఖపై సమీక్ష సమావేశం
- అనంతరం విజయ్ నిర్ణయంపై హర్షా తిరేకాలు

2



## కిషన్ రెడ్డి నంబర్ వన్

- మోదీ క్యాబినెట్‌లో కిషన్ రెడ్డి మార్క్
- పనితీరులో దేశంలోనే నంబర్ 1 మంత్రిగా రికార్డ్
- శాఖాపరమైన నిర్ణయాల్లో వేగం,పాలనలో పారదర్శకత ఆధారంగా ర్యాంకింగ్
- ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి
- ఆంధ్ర ప్రదేశ్ నుంచి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా టాప్ లో
- కిషన్ రెడ్డి నిబద్ధత, నిజాయితీ వల్లే ఈ గుర్తింపు
- బీజేపీ సీనియర్ నేత యస్. విష్ణువర్ధన్ రెడ్డి

2

# పండిన ధాన్యం మొత్తాన్ని కోనాల్సిందే



**ప్రతి గింజ కొనేవరకు పోరాటం చేస్తాం**

- బీజేపీ "రైతు ఘోష బీజేపీ భరోసా" ప్రారంభం
- ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిస్థితిపై ఆరా
- మూడు రోజుల పాటు "రైతు ఘోష బీజేపీ భరోసా" కార్యక్రమం
- వికారాబాద్ జిల్లాలో ప్రారంభం
- గజ్వేల్‌లోని మార్కెట్ యార్డులో ధాన్యం పరిశీలన
- వడ్లు కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో పండిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాల్సిందేనని బీజేపీ డిమాండ్ చేసింది. రైతు గోసబీజేపీ భరోసా ఆందోళనలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి వెళ్లిన బీజేపీ నేతలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిస్థితిపై ఆరా తీశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నేతలు వస్తున్నారని రాత్రికి రాత్రి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు అధికారుల హడావుడి చేశారని నేతలు మండిపడ్డారు.




2

## మహిళల అండతోనే ప్రజా ప్రభుత్వం

- మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు
- మహిళాశక్తి భవనాలకు రేవంత్ వర్చువల్‌గా శంకుస్థాపన
- 29 నెలలుగా నాణ్యమైన ఉత్పత్తులకు చిరునామాగా
- మహిళల ఉచిత బస్సు ప్రయాణాలను ప్రతిపక్షాలు విమర్శించాయి
- రూ.10 వేల కోట్లు ఆర్టీసీకి పని చెప్పి..ఆర్టీసీకి మేలు జరిగింది
- సీఎం రేవంత్ రెడ్డి

2



తెలంగాణలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం మహిళా వారోత్సవాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళాశక్తి భవనాలకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అన్ని కలెక్టరేట్‌లలో మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు. నాణ్యమైన ఉత్పత్తు9లకు వాటిని చిరునామాగా మార్చండని పిలుపునిచ్చారు.

*-తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో*

## హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించారా..?

- నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్
- కూకట్ పల్లిలో బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం
- కేటీఆర్ హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండండి




2



## అన్నాడీఎంకేకు గుడ్‌బై

- గుడ్‌బై చెప్పిన ముగ్గురు ఎమ్మెల్యేలు
- రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు
- అనంతరం టీవీకేలో చేరిక


**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తమిళనాడు రాజకీయాల్లో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపక్ష అన్నాడీఎంకే కు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు

..మిగతా 2 లో

## నైరుతి రుతుపవనాలు ఆలస్యం

- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం
- రాష్ట్రంలో మాన్‌సూన్ సీజన్‌పై ఎల్‌నినో ఎఫెక్ట్
- జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో కనిపించనున్న ప్రభావం
- తెలంగాణలో లోటు వర్షపాతం నమోదయ్యే సూచన
- తొలుత కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రాష్ట్రానికి నైరుతి రుతుపవనాల ఆగమనం మరింత ఆలస్యం కానుంది. రుతుపవనాలు తొలుత ఈనెల 26న కేరళ తీరాన్ని తాకుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే నాలుగైదు రోజులు ఆలస్యంగా తీరాన్ని తాకే అవకాశం ఉందని తాజాగా తెలిపింది. తెలంగాణలోకి జూన్ 5 నుంచి 10 తేదీల్లో నైరుతి ప్రవేశించే అవకాశం ఉందని చెప్పింది. ఈ ఏడాది మాన్‌సూన్ సీజన్‌పై ఎల్‌నినో ప్రభావం పడనుందని.. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో దీని ప్రభావం చూపనుందని వెల్లడించింది. దీంతో తెలంగాణలో లోటు

..మిగతా 2 లో



## ప్రజలపై పెట్రోల్ ధరల బాదుడు

- విడతలవారీగా భారాలు
- మరోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు
- పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు
- పది రోజుల్లో నాలుగో సారి ధరలకు రెక్కలు
- సామాన్యుడిపై పెనుభారం.
- ఐదు రాష్ట్రాలు ఎన్నికల వరకు పెంచని కేంద్రం
- ఎన్నికల అనంతరం వరుసగా పెంపు
- బీజేపీ సర్కారుపై జనాగ్రహం

2



# నైరుతి రుతుపవనాలు ఆలస్యం

▶▶ మొదటిపేజీ తరువాయి

వర్షపాతం నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగరంలోని అనేక చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్‌లో భారీ వర్షం కురవగా.. ఘట్‌కేసర్‌లో వడగాళ్ల వర్షం పడింది. మెదక్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. వర్షం కారణంగా జిల్లా కేంద్రంలోని గంగినేని థియేటర్ సమీపంలో రోడ్ జలమయమైంది. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలిగింది. జిల్లాలోని ర్యాలమడుగు గ్రామంలో వర్షం కారణంగా ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. ఇదే తరహాలో మంభోజిపల్లి గ్రామంలో కురిసిన భారీ వర్షంతో పాటు ఈదురు గాలుల కారణంగా 3 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం కారణంగా మెదక్ మార్కెట్ యార్డ్‌లో ధాన్యం బస్తాలు తడిశాయి. మగ్దుంపూర్ కొనుగోలు కేంద్రంలో కూడా వేసిన 2 లారీల వడ్లు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

# మహిళల అండతోనే ప్రజా ప్రభుత్వం

తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:

తెలంగాణలో మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం మహిళా వారోత్సవాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8 వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళాశక్తి భవనాలకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అన్ని కలెక్టరేట్‌లలో మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించారు. నాణ్యమైన ఉత్పత్తులతో వాటిని చిరునామాగా మార్చాలని పిలుపునిచ్చారు.

ఆడబిడ్డల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్న రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. 29 నెలల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలకు రూ.10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించామని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వడం కొంతమందికి నచ్చలేదని ఆరోపించారు. మహిళలను బస్సులకు యజమానులను చేశామని, అంబానీ, అదానీ చేసే పెట్రోల్ వ్యాపారం మహిళలు కూడా చేయాలనే బంక్‌లు పెట్టించామని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, బ్యాంక్ లోన్లు చెల్లింపులో నిర్మల్ జిల్లా మహిళా సంఘాలు మొదటి స్థానంలో ఉన్నాయని ప్రత్యేకంగా అభినందించారు. బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని, మహిళా సంఘాల ఉత్పత్తుల కోసం గోడౌన్‌లకు స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. మహిళ దగ్గర సంచే మిల్లర్ల వద్దు తీసుకెళ్లేలా ప్రణాళికలు చేస్తున్నామని వెల్లడించారు.

మహిళా శక్తి సూపర్ బజార్‌లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మహిళా శక్తి సూపర్ బజార్‌లో మహిళలకు పెట్టుబడి పెట్టాలని కోరారు. నాణ్యమైన ఉత్పత్తులకు మహిళా శక్తి సూపర్ బజార్‌లు చిరునామాగా మార్చాలని తెలిపారు. సొంత చెల్లెళ్లే ఇంట్లో నుంచి వెళ్లగొడుతున్నారని, తాము మహిళలను ఆదుకుంటూ చూడాలని భావించి చీరలు పంచుతున్నామని, ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే ప్రజా ప్రభుత్వం కలకాలం ఉంటుందని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా 8వేల మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాన్ని సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క, సీతక్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. వర్చువల్‌గా స్వయం సహాయక సంఘాల మహిళలు, కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు రూ.50వేల రుణమాఫీ

తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:



తమిళనాడులో రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి డా. సి. జోసెఫ్ విజయ్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన లక్షలాది మంది రైతులకు ఊరటనిస్తూ భారీ రుణమాఫీని ప్రకటించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులు , ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశం అనంతరం సీఎం ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సామాన్య, మధ్యతరగతి రైతు కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపింది.ప్రభుత్వ తాజా ప్రకటన ప్రకారం.. గత ఏడాది మే 1, 2025 నుండి ఫిబ్రవరి 28, 2026 మధ్య కాలంలో సహకార బ్యాంకుల నుండి పంట రుణాలు తీసుకున్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14,22,555 మంది రైతులు ఈ రుణమాఫీ వల్ల రుణ విముక్తులు కానున్నారు. దీనికోసం తమిళనాడు ప్రభుత్వంపై రూ. 2,044.46 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలే ముఖ్యమని సీఎం విజయ్ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకంలో చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. రూ. 50,000 లోపు రుణం ఉన్న అల్ప ఆదాయ రైతులకు వంద శాతం రుణమాఫీని ప్రకటించింది. అంటే వారి అప్పు మొత్తం పూర్తిగా రద్దు కానుంది. ఇతర రైతులకు కూడా అదే స్థాయిలో 50 శాతం వరకు రుణమాఫీ వర్తించనుంది. రుణ మొత్తం పెరిగే కొద్దీ ప్రభుత్వం ఒక నిర్దేశిత మొత్తాన్ని మాఫీ చేస్తూ పట్టికను విడుదల చేసింది. గరిష్టంగా లక్ష రూపాయలకు పైగా రుణం ఉన్నవారికి కూడా రూ. 5,000 వరకు రాయితీ కల్పించారు. పంట రుణాల మాఫీ ద్వారా రైతులకు కొత్తగా రుణాలు పొందే అవకాశం కలుగుతుందని, ఇది రాబోయే సాగు సీజన్‌కు ఎంతో మేలు చేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేవలం అప్పులు రద్దు చేయడమే కాకుండా, వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆర్బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా, రాబోయే 45 నుండి 60 రోజుల్లోనే ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.సీఎం విజయ్ తీసుకున్న ఈ నిర్ణయంపై తమిళనాడు రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద రైతులకు ఈ పథకం ఒక వరమని అభిప్రాయపడుతున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే రైతుల పక్షపాతిగా విజయ్ గుర్తింపు పొందాలని చూస్తున్నట్లు ఈ పథకం ద్వారా స్పష్టమవుతోంది. ఈ నిర్ణయం రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో టీవీకే (TVK) పార్టీకి మరింత మైలేజీని ఇస్తుందని భావిస్తున్నారు.

# పండిన ధాన్యం మొత్తాన్ని కొనాల్సిందే

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో పండిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాల్సిందేనని బీజేపీ డిమాండ్ చేసింది. రైతు గోసబీజేపీ భరోసా ఆందోళనలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి వెళ్లిన బీజేపీ నేతలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిస్థితిపై ఆరా తీశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నేతలు వస్తున్నారని రాత్రికి రాత్రి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు హడావుడి చేశారని నేతలు మండిపడ్డారు.

కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవకతవకలు, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతు గోసబీజేపీ భరోసా ఆందోళనలో భాగంగా బీజేపీ నేతలు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని మార్కెట్ యార్డులో ధాన్యం పరిశీలించారు. ఈ యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సహా ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు పాల్గొన్నారు. వడ్లు కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రైతులకు నష్టం జరిగితే ప్రభుత్వం మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ప్రతి గింజ కొనేవరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని రామచందర్‌రావు తెలిపారు. రైతు సమస్యలపై కాషాయ పార్టీ కదం తొక్కింది. నేటి నుంచి మూడు రోజుల పాటు 'రైతు ఘోష బీజేపీ భరోసా" కార్యక్రమలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు నేతృత్వంలో పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. సాయంత్రం 5 గంటలకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ మార్కెట్ యార్డును సందర్శించారు. రాత్రి అక్కడే బస చేయనున్నారు. రేపు రోజు ఉదయం గజ్వేల్ నుంచి భువనగిరి బయల్దేరి వెళ్లనున్నారు. 9:30 గంటలకు భువనగిరి మార్కెట్ యార్డును సందర్శించి రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం ఆలేరులో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఆ తర్వాత జనగాం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించనున్నారు. జనగాం నుంచి ఎస్‌ఎస్‌ఆర్ ములుగులో క్షేత్ర స్థాయిలో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. రాత్రి ఎస్‌ఎస్‌ఆర్ ములుగులో బస చేయనున్నారు. ఎల్లుండి ఉదయం 8:30 గంటలకు భూపాలపల్లి జిల్లా కేంద్రం మార్కెట్ యార్డును సందర్శించనున్నారు. ఆ తరువాత మంథని మార్కెట్ యార్డును సందర్శించనున్నారు. సాయంత్రం ఐదు గంటలకు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి రాత్రి పెద్దపల్లిలోనే బస చేయనున్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని రైతులకు బీజేపీ ప్రతినిధుల బృందం వివరించనుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రతి గింజ కొనుగోలు చేసేలా ఒత్తిడి పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగనుంది.

# హైదరాబాద్‌లో ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించారా..?

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇల్లు అయిన నిర్మించిందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. అలా నిర్మించినట్టు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**ఈ సందర్భంగా కేటీఆర్ సర్**

ప్రక్రియ సర్వేతో ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటికి అధికారులు వచ్చినప్పుడు సరైన వివరాలు ఇవ్వాలని, ప్రతి ఓటరునూ అప్రమత్తం చేయాలని చెప్పారు. ఎస్ఐఆర్‌కు సంబంధించి ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. “ఓటు మీ హక్కు” అని పేర్కొంటూ, ఇంటికి అధికారులు వచ్చినప్పుడు సరైన వివరాలు ఎలా ఇవ్వాలి.. ఓటు హక్కును ఎలా కాపాడుకోవాలనే అంశాలపై కార్యకర్తలు, ప్రజలకు సూచనలు చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో కార్యకర్తలు సైనికుల్లా పని చేసి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ సాధించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో లక్ష మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను బీఆర్ఎస్ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, వారిని ఆదుకునే బాధ్యత పార్టీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల్లో ఉంటూ కష్టపడే నాయకులకే కార్పొరేటర్ టికెట్ కచ్చితంగా దక్కుతుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో, అప్పటి మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు.

# కిషన్ రెడ్డి నంబర్ వన్

తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:

కేంద్ర ప్రభుత్వంలో తెలుగు నేతలు తమదైన ముద్ర వేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర మంత్రివర్గంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న మంత్రుల జాబితాలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అగ్రస్థానంలో నిలిచారు. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి అధికారికంగా విడుదల చేసిన తాజా ర్యాంకుల్లో కిషన్ రెడ్డికి ప్రథమ స్థానం దక్కింది. మంత్రుల పనితీరు, ఫైళ్ల క్లియరెన్స్ వేగం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలతో అనుసంధానం వంటి కీలక అంశాల ప్రాతిపదికన ఈ ర్యాంకులను కేటాయించారు. బొగ్గు , గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి కిషన్ రెడ్డి తనదైన ముద్ర వేశారు. శాఖాపరమైన నిర్ణయాల్లో వేగం పెంచడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను అత్యంత వేగంగా పరిష్కరించడం ద్వారా పాలనలో పారదర్శకతను పెంచారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయడంలో ఆయన చూపిన చొరవను కేంద్రం గుర్తించింది. ఈ ర్యాంకింగ్స్‌లో కిషన్ రెడ్డితో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కూడా టాప్ పెర్ఫార్మర్ల జాబితాలో నిలిచారు. కిషన్ రెడ్డికి అగ్రస్థానం దక్కడంపై ఏపీ బీజేపీ సీనియర్ నేత, జాతీయ కౌన్సిల్ సభ్యుడు యస్. విష్ణువర్ధన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి నిబద్ధత, నిజాయితీ వల్లే ఈ గుర్తింపు లభించిందని, ఇది తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. మోదీ టీంలో నంబర్ వన్ మంత్రిగా నిలవడం ఆయన సమర్థతకు నిదర్శనమని కొనియాడారు. మంత్రుల పనితీరు, అభివృద్ధి ర్యాంకుల్లో శ్రీ కిషన్ రెడ్డి అగ్రస్థానంలో నిలవడం అభినందనీయం. కిషన్ రెడ్డి సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనంగానే దేశవ్యాప్తంగా ఉత్తమ ర్యాంకు సాధించిన మంత్రుల జాబితాలో తొలి వరుసలో నిలిచారు . ఈ రిపోర్టు ప్రధానంగా డిజిటల్ ఫైల్ మూవ్‌మెంట్, క్షేత్ర స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, మినిస్ట్రీ అవుట్‌పుట్ ఆధారంగా రూపొందించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే తన శాఖను దేశంలోనే ముందంజలో ఉంచిన కిషన్ రెడ్డి గారిపై రాజకీయ వర్గాల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

# ముచ్చెర్లలో ఫ్యాన్సీ దుకాణంలో అగ్ని ప్రమాదం

కామేపల్లి, తెలంగాణ చౌరస్తా:



ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలోని ముచ్చెర్ల సెంటర్‌లో సోమవారం ఫ్యాన్సీ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక వ్యాపారులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు.వెంటనే అప్రమత్తమైన స్థానికులు మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం మధ్యాహ్న సమయంలో దుకాణం లోపల నుంచి పొగలు రావడం గమనించారు. కొద్దిసేపటికే మంటలు వ్యాపించడంతో సమీప దుకాణదారులు,స్థానికులు కలిసి నీటి సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు.మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించే అవకాశం ఉండటంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.అయితే స్థానికుల చాకచక్యంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.ఈ ప్రమాదంలో ఫ్యాన్సీ వస్తువులు, అలంకరణ సామగ్రి,ఇతర సరుకులు కొంత మేర దగ్ధమైనట్లు సమాచారం.ఆస్తినష్టం వివరాలు ఇంకా తెలియరాలేదు.ఘటన సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.ప్రాథమికంగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని భావిస్తున్నారు.విద్యుత్ వైరింగ్‌లో లోపాలు లేదా అధిక లోడ్ కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు తెలిపారు.ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ ఘటనతో ముచ్చెర్ల సెంటర్‌లో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.వ్యాపార సంస్థల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలని,వైరింగ్ వ్యవస్థలను తరచూ పరిశీలించుకోవాలని స్థానికులు సూచిస్తున్నారు.

# అన్నాడీఎంకేకు గుడ్‌బై

▶▶ మొదటిపేజీ తరువాయి

తమ పదవులకు రాజీనామా చేసి, ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని అధికార తమిళగ వెట్రి కళగంలో చేరారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మధురాంతకం ఎమ్మెల్యే మరగతం కుమార్వేల్, ధరాపురం ఎమ్మెల్యే సత్యభామ, పెరుందురై ఎమ్మెల్యే జయకుమార్ తమ రాజీనామా లేఖలను అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు అందజేశారు.అనంతరం మంత్రి ఆధవ్ అర్జునను కలిసి వారు టీవీకేలో చేరారు. ఈ ముగ్గురు నేతలు అన్నాడీఎంకేలోని మాజీ మంత్రులు సీవీ షణ్ముగం, ఎస్పీ వేలుమణి వర్గానికి సన్నిహితులుగా పేరుపొందారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాల్లో పోటీ చేసిన టీవీకే 108 సీట్లు గెలుచుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మెజారిటీకి కొన్ని స్థానాలు తగ్గడంతో కాంగ్రెస్, ఇతర పార్టీల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వేలుమణి వర్గానికి చెందిన 25 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు టీవీకే ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నట్లు అసెంబ్లీలో విజయ్ బలపరీక్ష సందర్భంగా తేలింది. తాజాగా ముగ్గురు ఎమ్మెల్యేలు అన్నాడీఎంకేకు గుడ్‌బై చెప్పడంతో.. భవిష్యత్తులో ఆ పార్టీ నుంచి మరిన్ని వికెట్లు పడతాయనే ఊహాగానాలు మొదలయ్యాయి. కాగా ఇప్పటికే సీఎం విజయ్ తిరుచ్చి తూర్పు స్థానానికి రాజీనామా చేయగా.. ఇప్పుడు ఈ ముగ్గురి రాజీనామాలతో రాష్ట్రంలో ఖాళీ అయిన అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య నాలుగుకు చేరింది. దాంతో త్వరలో జరగబోయే ఉపఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది

# న్యాయస్థానాల ఆదేశాల బేఖాతరు

- **లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్‌పై జిల్లా కలెక్టర్‌కు గిరిజనుల ఫిర్యాదు**
- **గట్టుమల్ల పరిధిలోని ప్రభుత్వ గరిష్ట పరిమితి భూముల్లో ఆదివాసీల సాగుకు ఆటంకం.**
- **ఉన్నత న్యాయస్థానం, ఏజెన్సీ కోర్టుల ఉత్తర్వులున్నా ఖాతరు చేయని వైనం.**
- **రాజకీయ నాయకుల అండతో గిరిజనేతరుల వేధింపులు బాధిత గిరిజన రైతుల ఆవేదన.**

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, లక్ష్మీదేవిపల్లి మండలం, గట్టుమల్ల రెవిన్యూ గ్రామ పరిధిలోని ప్రభుత్వ గరిష్ట పరిమితి (సీలింగ్) భూముల వివాదంలో స్థానిక తహసీల్దార్ వ్యవహారశైలిపై బాధిత గిరిజన పట్టాదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయస్థానాల స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నప్పటికీ, వాటిని బేఖాతరు చేస్తూ తహసీల్దార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బాధితులు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏళ్ల నాటి సాగు భూమి.. న్యాయస్థానాల అనుకూల తీర్పులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుమల్ల రెవిన్యూ గ్రామ పరిధిలోని సర్వే సంఖ్యలు నూట పన్నెండు, నూట పదమూడు, నూట పద్నాలుగు, నూట పదిహేను, నూట పదహారులో గల డెబ్బై రెండు ఎకరాల ప్రభుత్వ గరిష్ట పరిమితి భూమిని రెండు వేల ఏడు సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం నిరుపేద, నిరుద్యోగ గిరిజనులైన ఇరవై నాలుగు మంది ఆదివాసీలకు పట్టాలు జారీ చేసి, పంచనామా నిర్వహించి స్వాధీనపరిచింది. నాటి నుండి నేటి వరకు ఆయా భూముల్లో సదరు పట్టాదారులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

ఈ భూములకు సంబంధించి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు), కొత్తగూడెం ఏజెన్సీ డివిజనల్ అధికారి వారి న్యాయస్థానం, భద్రాచలం ప్రభుత్వ అదనపు ఏజెంట్ వారి న్యాయస్థానాలు గిరిజన పట్టా రైతులకు అనుకూలంగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. సదరు భూములపై గాని, పట్టాదారులపై గాని ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోరాదని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి."న్యాయస్థానాల స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నా రెవిన్యూ అధికారులు గిరిజనేతరులకు కొమ్ముకాయడం దుర్మార్గం."

**-బాధిత గిరిజన రైతులు**

**నకిలీ పత్రాలతో వేధింపులు:**

ఇంతటి స్పష్టమైన కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, గట్టుమల్ల గ్రామానికి చెందిన ముగ్గురు గిరిజనేతరులు (చెరుకుమల్లి కృష్ణ, చెరుకుమల్లి వెంకట నర్సయ్య, చెరుకుమల్లి చిన్న నాగేశ్వరరావు) అధికార పార్టీకి చెందిన కొందరు రాజకీయ నాయకుల అండదండలతో నకిలీ పత్రాలను సృష్టించారని బాధితులు ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి మండల తహసీల్దార్ వారి కార్యాలయ సిబ్బంది సహకారంతో.. సదరు సాగు భూములను సర్వే చేయాలనే సాకుతో తమను వ్యవసాయం చేసుకోనివ్వకుండా, పంట ఉత్పత్తులను సేకరణ చేయనీయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోయారు.

**చర్యలు తీసుకోవాలని డిమాండ్:**

న్యాయస్థానాల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ, గిరిజన రైతుల పొట్టగొట్టే విధంగా వ్యవహరిస్తున్న లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ తీరుపై, అలాగే నకిలీ పత్రాలతో వేధిస్తున్న గిరిజనేతరులపై తగిన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని ప్రత్యక్షంగా కలిసి ఫిర్యాదు సమర్పించనున్నట్లు బాధిత గిరిజన రైతులు ఒక ప్రకటనలో తెలిపారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బాధిత గిరిజన పట్టాదారులు పూణెం నాగేశ్వరరావు, కుంజ లక్ష్మయ్య, ఎస్. వెంకటేశ్వర్లు, బి. వెంకటేశ్వర్లు, పడిగ సీతయ్య, శెట్టిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండతో అల్లాడించిన సూర్యుడు...

# వర్షంతో ఊరట ఇచ్చిన ప్రకృతి

- **ఏన్కూర్‌లో ఒక్కరోజే విభిన్న వాతావరణ పరిస్థితులు**

ఏన్కూర్, తెలంగాణ చౌరస్తా:

ఏన్కూర్ మండల కేంద్రంలో సోమవారం వాతావరణం అనూహ్యంగా మారి ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది.ఉదయం నుంచి మండిపడిన ఎండలు మధ్యాహ్నం వరకు కొనసాగగా, అనంతరం ఈదురుగాలులు, దుమ్ము గాలులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.సాయంత్రానికి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఎండల నుంచి ఉపశమనం లభించింది.ఉదయం నుంచే అధిక ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. ముఖ్యంగా రహదారులపై ప్రయాణించే వాహనదారులు,కూలీలు, వ్యాపారులు ఎండ తీవ్రతతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మధ్యాహ్నం సమయంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు వెలవెలబోయిన దృశ్యాలు కనిపించాయి. మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని బలమైన ఈదురుగాలులు వీచాయి.దుమ్ము గాలుల కారణంగా కొంతసేపు రహదారులపై దృశ్యమానం తగ్గింది. అనంతరం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు చోట్ల రహదారులపై నీరు నిలిచిపోయింది.రోజంతా ఎండ తాపంతో ఇబ్బంది పడ్డ ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షం కొంత ఊరటనిచ్చింది. రైతులు మాత్రం ఈ వర్షం పంటలకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండలు ఉండగా,సాయంత్రానికి వాతావరణం పూర్తిగా మారిపోయిందని స్థానికులు తెలిపారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.ముఖ్యంగా ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద నిలబడకుండా, అవసరమైతే మాత్రమే బయటకు రావాలని హెచ్చరించారు.

# ప్రజలపై పెట్రోల్ ధరల బాదుడు

తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:

కేంద్రంలోని మోడీ సర్కారు దేశ ప్రజలకు విడతలవారీగా షాక్‌లు ఇస్తోంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచింది. పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరగడంతో సామాన్య ప్రజలకు అదనపు భారం తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నట్టు ప్రకటించింది. లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, లీటర్ డీజిల్‌పై రూ.2.71 పెంచింది. పెరిగిన ఈ కొత్త ధరలు సోమవారం ఉదయం ఆరు గంటల నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. అయితే ఇది పది రోజుల వ్యవధిలో జరిగిన నాలుగో ధరల పెంపు కావడం గమనార్హం. దేశంలో వరుసగా పెరుగుతున్న ఇంధన ధరలతో ఇప్పటికే సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, తాజా పెంపు మరింత భారాన్ని మోపనుంది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు దాదాపు రూ.8 వరకు పెరిగాయి. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.102.12కు చేరుకోగా, డీజిల్ ధర రూ.95.20కు పెరిగింది. ముంబయిలో లీటర్ పెట్రోల్ ధర రూ.111.18కి, డీజీల్ ధర రూ.97.83కి చేరింది. బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.110.93కి, డీజీల్ ధర రూ.98.80కి పెరిగింది. చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.77కు, డీజీల్ ధర రూ.99.55కు ఎగబాకింది. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.113.47కి, డీజీల్ ధర రూ.99.82కి చేరింది. ఇక తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.2.88 పెరిగి.. ధర రూ.115.73కి చేరుకుంది. లీటర్ డీజిల్‌పై కూడా రూ.2.88 పెరిగి.. ధర రూ.103.82కు ఎగబాకింది. మరోవైపు ఏపీలోని విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.117.75కి, లీటర్ డీజిల్ ధర రూ.105.43కు చేరింది.

**‘ఎన్నికల ప్రయోజనాలే ముఖ్యం’**

దేశంలో ఇటీవల ఐదు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకు పెట్రోల్, డీజీల్ ధరలు పెంచని మోడీ సర్కారు.. ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడిన కొన్ని రోజులకే ధరల పెంపునకు సిద్ధపడింది. ఇందులో భాగంగా చమురు ఉత్పత్తి ధరలను పెంచుతూ వస్తోంది. దేశ ప్రజలపై భారం మోపుతూ వస్తోంది. ఇందుకు అంతర్జాతీయ పరిణామాలను సాకుగా చూపుతూ తన బాధ్యతను విస్మరిస్తోంది. మోడీ ప్రభుత్వానికి ఎన్నికల ప్రయోజనాలు తప్పితే ప్రజల ఇబ్బందులు పట్టవని చెప్పడానికి అసెంబ్లీ ఎన్నికల తర్వాత వరుసగా పెరుగుతూ వస్తున్న పెట్రో ధరలే ప్రత్యక్ష నిదర్శనమని విశ్లేషకులు చెప్తున్నారు. వరుసగా పెరుగుతున్న పెట్రో ధరల పెంపుతో దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యవసరాల ధరల పెరుగుదల వారి జేబులను గుల్ల చేస్తోంది. దీంతో ధరల పెంపుదల విషయంలో మోడీ సర్కారుపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటు ప్రతిపక్షాలు, పలు ప్రజాసంఘాలు సైతం పెట్రో ధరల మంటను చల్లార్చాలని రోడ్డెక్కుతున్నాయి. మోడీ సర్కారుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాయి





# అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా 'ప్రజా పాలన ప్రణాళిక'

- మహిళా వారోత్సవాలు గర్భిణులతో వంటల కార్యక్రమం
- తల్లులతో ప్రతిజ్ఞ పోషకాలపై అవగాహన కల్పించిన సూపర్‌వైజర్ పార్వతి

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

రామవరం సెక్టార్ పరిధిలోని చిట్టి రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో 99వ రోజుల "ప్రజా పాలన ప్రణాళిక" మహిళా వారోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రామవరం సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీమతి పార్వతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలతో కలిసి ప్రత్యేకంగా వంటల కార్యక్రమాన్ని (కుకింగ్ ప్రోగ్రామ్) నిర్వహించారు. గర్భధారణ సమయంలో ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలో ప్రత్యక్షంగా వివరించడానికే ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ ..."గర్భిణులు, బాలింతలు చిన్న పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం. దైనందిన జీవితంలో స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో భాగం చేసుకోవాలి." అని ఆమె తల్లులకు అవగాహన కల్పించారు.అనంతరం కేంద్రానికి వచ్చిన తల్లులందరితో పిల్లల ఆరోగ్యం, సంరక్షణ సరైన పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రామవరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ప్రజా సంక్షేమమే పరమావధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రూ. 20 లక్షల 81 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

నియోజకవర్గ ప్రజల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పని చేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. సోమవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలు, డివిజన్లకు సంబంధించిన 45 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా మంజూరైన 20 లక్షల 81 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అండగా నిలుస్తుందని తెలిపారు. దీని ద్వారా ప్రతి నెల లక్షలాది రూపాయల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, ఎల్‌ఓసిలు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, పరమేష్ యాదవ్, రామచందర్, ఖదీర్, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.



# పసుల చంద్రకళ త్వరగా కోలుకోవాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

**నూతనకల్, తెలంగాణ చౌరస్తా:**

నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ తల్లి పసుల చంద్రకళకి ఇటీవల వెన్నెముకకు శస్త్రచికిత్స జరగడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో తుంగతుర్తి నియోజకవర్గ శాసన సభ్యులు మందుల సామేల్, రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చంద్రకళ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ పసుల వెంకన్న యాదవ్,గ్రామ శాఖ అధ్యక్షుడు లింగాల రామచంద్రయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం ఊరు బంగారుమయం... మా ఊరు గుంతలమయం

- సిపిఎం రాష్ట్ర నేత భూపాల్

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన సొంత గ్రామం కొండారెడ్డిపల్లిని 200 కోట్ల రూపాయలతో అంగరంగ వైభవంగా తీర్చిదిద్దుతున్నారు.మా ఊర్లు మాత్రం రోడ్లు గుంతలమయం. అంధకారంలో జీవిస్తున్నామని సిపిఎం రాష్ట్ర నాయకులు కామ్రేడ్ భూపాల్ అన్నారు.అధ్వానమైన రోడ్లు బాగు చేయాలని సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి,మున్సిపల్ పార్కు దగ్గర భారీ ధర్నా ఏర్పాటు చేశారు.ఆయన ప్రసంగిస్తూ నారాయణపేట జిల్లాలో ముఖ్యంగా నారాయణపేట నియోజకవర్గంలో ఏ గ్రామం చూసిన గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయని,ఎలాంటి అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదని అని అన్నారు.గత ప్రభుత్వం చేపట్టిన పనులను కూడా పూర్తి చేయలేకపోవడం నేటి పాలకులు మన ప్రాంతంపై చూపిస్తున్న వివక్షత అని ఆందోళన వ్యక్తం చేశారు.సీఎం 514 కుటుంబాలు కలిగిన తన గ్రామంలో ప్రతి కుటుంబానికి సోలార్ సిస్టం,గ్రామంలో అంతర్గత మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు 18 కోట్ల రూపాయలు కేటాయించారని,కానీ పురాతనమైన నారాయణపేట మున్సిపాలిటీకి అంతర్గత మురుగునూటి వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న ధ్యాసే లేదని ఎద్దేవా చేశారు.పక్కనున్న కొడంగల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి డబుల్ రోడ్డు వేస్తున్నారు.వేల కోట్ల రూపాయలు గుమ్మరిస్తున్నారు.తన నియోజకవర్గం మీద మరియు తన సొంత గ్రామం మీద ఉన్న ప్రేమ పక్కనే ఉన్న నారాయణపేట నియోజకవర్గం పైన ఎందుకు లేదని ప్రశ్నించారు.వివక్షత పాలనపై ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు ముందుకు రావాలని,ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రవాణా వ్యవస్థ ఏ ప్రాంతానికి అయినా అభివృద్ధికి సూచిక అన్నారు.అయితే నారాయణపేట నియోజకవర్గం మాత్రం రవాణా వ్యవస్థలో పూర్తిగా క్షీణస్థాయిలో ఉందని విమర్శించారు.రోడ్డు,రైల్వే,విమాన యానం తదితర రవాణా సౌకర్యాలకు ప్రజలు నోచుకోవడం లేదన్నారు.ఇది పాలకుల పాపమేనన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలో నుంచి మక్తల్,మరికల్,కోయిలకొండ,యానగుంది,మద్దూర్ ముఖ్యమైన రహదారులు ధ్వంసమై ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయడంలో పాలకులు తీవ్రమైన నిర్లక్ష్యం కనబరుస్తున్నారని విమర్శించారు.గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రోడ్ల సమస్యలపై సర్వేలు చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నామని తెలిపారు. కోటకొండ,మక్తల్,దామరగిద్ద ల నుంచి బైక్ యాత్రలతో నారాయణపేట జిల్లా కేంద్రంకు చేరుకున్నారు.జిల్లా కేంద్రంలోని భారం భావి నుంచి ప్రధానమైన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి,మున్సిపల్ పార్కు దగ్గర భారీ ధర్నా చేశారు.ఈ ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండమీది బలరాం అధ్యక్షత వహించగా,సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గా సభ్యులు కామ్రేడ్ గోపాల్, అంజిలయ్య, పుంజనూరు ఆంజనేయులు,జిల్లా నాయకులు గుండెగారి దస్తప్ప,జోషి,గోవిందరాజ్,కాశప్ప నరహరి,మహేష్ కుమార్ గౌడ్,బొమ్మను పాడు బలరాం, పవన్, మల్లేష్, గోవిందు, తదితరులు ప్రసంగించారు.






# తెల్లాపూర్ సరస్సులను సంరక్షించండి.. పునరుద్ధరించండి

- తెల్లాపూర్ నెయిబర్‌హుడ్ అసోసియేషన్ విజ్ఞప్తి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు వినతి పత్రం

**పటాన్ చెరు తెలంగాణ చౌరస్తా:**

తెల్లాపూర్ ప్రాంతంలోని ప్రధాన సరస్సులను పరిరక్షించడంతో పాటు పునరుద్ధరించాలని తెల్లాపూర్ నెయిబర్‌హుడ్ అసోసియేషన్ (టెనా) ప్రతినిధి బృందం హైడ్రాకు విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ ను టెనా ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రతినిధి బృందంలో టెనా అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి తో పాటు జనరల్ సెక్రటరీ సుధాకర్ అల్లాడి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు దీప్తి రెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు. తెల్లాపూర్ మరియు పరిసర ప్రాంతాల్లోని 70కి పైగా గేటెడ్ కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న టెనా మెల్లచెరువు, చెలికుంట, వనం చెరువు అనే మూడు ప్రధాన సరస్సుల దయనీయ పరిస్థితిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లింది. సరైన డ్రైనేజీ వ్యవస్థ, సరిపడా ఎస్‌టీపీలు లేకపోవడం, సహజ నాళాల ఆక్రమణలు మరియు మూసివేతల కారణంగా ఈ సరస్సులు తీవ్ర కాలుష్యానికి గురవుతున్నాయని ప్రతినిధులు వివరించారు. ఓఆర్‌ఆర్ పరిధిలో హైడ్రా చేపడుతున్న సరస్సుల పరిరక్షణ చర్యలను టెనా ప్రతినిధులు అభినందిస్తూ, అదే విధంగా తెల్లాపూర్ సరస్సుల పునరుద్ధరణకు కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సరస్సుల దుస్థితి భూగర్భ జలాలు, జీవ వైవిధ్యం మరియు ప్రజారోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సహజ ఫీడర్ నాళాల పునరుద్ధరణ మరియు పరిరక్షణ, సమగ్ర డ్రైనేజీ మౌలిక వసతుల ఏర్పాటు, సరిపడా ఎస్‌టీపీల ఏర్పాటు, పర్యవేక్షణతో పాటు దీర్ఘకాలిక సరస్సుల పరిరక్షణ, అభివృద్ధి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సమర్పించిన వినతిపత్రంలో టెనా ప్రతినిధులు కోరారు. టెనా అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడాలంటే సరస్సుల పరిరక్షణ అత్యంత అవసరమని చెప్పారు. త్వరలోనే తెల్లాపూర్‌ను స్వయంగా సందర్శించి, సరస్సులు మరియు డ్రైనేజీ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ హామీ ఇచ్చినట్టు తెలిపారు.తెల్లాపూర్ సరస్సుల పరిరక్షణ మరియు పునరుద్ధరణ కోసం హైడ్రా త్వరిత గతిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# మట్టి లారీలను అడ్డుకున్న నిట్టూరు గ్రామస్తులు

- పరిమితికి మించి ఇష్టానుసారంగా ఓవర్ లోడ్ తో మట్టి తరలింపు
- పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమ మట్టి లారీల రాకపోకలు


**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**

సుల్తానాబాద్ మండలం కొదురుపాక ఎల్లమ్మ చెరువు నుంచి చెరువు మట్టిని ఓవర్ లోడ్ తో తీసుకెళ్తున్న లారీలను పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామస్తులు అడ్డుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొదురుపాక నుంచి మరో దారి గుండా వెళ్లకుండా మా గ్రామం మీదుగా రావడం ఏమిటని ప్రశ్నించారు. నిర్ణిత సమయంలో కాకుండా ఇష్టారాజ్యాంగా పగలు, రాత్రి ఓవర్ లోడ్ తో లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పాడవడమే కాకుండా దుమ్ము, ధూళి విపరీతంగా ఇండ్లలోకి చేరుతుందని మండిపడ్డారు. దీంతో తమ ఆరోగ్యాలు దెబ్బతింటాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



# అశ్వారావుపేటలో ఉధృతమైన ఐకేపీ వీఓఏల సమ్మె

- నాలుగో రోజుకు చేరిన నిరసనలు
- న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి
- అశ్వారావుపేటలో ఎగిసిన ఐకేపీ వీఓఏల నిరసన జ్వాల
- రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి
- ఐకేపీ వీఓఏల నిరసనల హోరు..
- ఉద్యోగ భద్రతకై డిమాండ్



**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మె రోజురోజుకు ఉధృతమవుతోంది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు సోమనాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నిరసన శిబిరం వద్ద మహిళా వీఓఏలు, సిబ్బంది పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఐకేపీ వీఓఏలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల అభివృద్ధి, పొదుపు సంఘాల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అనేక కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రతినిధులు పేర్కొన్నారు. రాత్రింబవళ్లు శ్రమిస్తూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తున్నప్పటికీ, తమ సేవలకు తగిన గుర్తింపు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అందుతున్న పారితోషికం కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని, పెరుగుతున్న ధరలతో జీవనం భారంగా మారిందని కన్నీటి పర్యంతమయ్యారు.ఈ సందర్భంగా వీఓఏల ప్రతినిధులు బుజ్జి, దాసరి రేవతి మాట్లాడుతూ.. తమకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్.ఆర్ పాలసీని వర్తింపజేయాలని కోరారు. అలాగే అర్హతలు, అనుభవం ఉన్న వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, ఇందుకోసం స్పష్టమైన పదోన్నతుల విధానాన్ని తీసుకురావాలని ఒత్తిడి తెచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య తిరుగుతూ విధులు నిర్వహించే తమకు ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రమాదాల సమయంలో తమ కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడుతున్నాయని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ డిమాండ్లపై తక్షణమే చర్చలు జరపాలని, సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో దశల వారీగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భారీ నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమానికి స్థానిక ప్రజా సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున హాజరై తమ పూర్తి మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారు. కాగా, వీఓఏల సమ్మె కారణంగా మండలంలో ఐకేపీ కార్యకలాపాలు పాక్షికంగా ప్రభావితమవుతున్నట్లు తెలుస్తోంది. సమస్యల పరిష్కారం అయ్యే వరకు వెనక్కి తగ్గేదే లేదని వీఓఏలు స్పష్టం చేయడంతో, ప్రభుత్వం దీనిపై ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.





# సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం కోసం వెయ్యి గజాల స్థలం, భవన నిర్మాణం

- అర్హులైన సెంట్రింగ్ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- ప్రతి కార్మికుడికి గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ అందించేలా చర్యలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగానికి కీలకంగా మారిన సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అతి త్వరలో వారి కోసం వెయ్యి గజాల స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

సోమవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో నియోజకవర్గస్థాయి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనులు చేయాలని కోరారు. సంఘం సభ్యుల కోరిక మేరకు.. అతి త్వరలో వెయ్యి గజాల స్థలంతో పాటు భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్మిక శాఖ అధికారులతో చర్చించి ప్రతి కార్మికుడికి ఆరోగ్య భద్రతను అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి సెంట్రింగ్ కార్మికుడికి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు.. లేనివారికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, అమీన్ పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, రాజు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు యాదగిరి, అధ్యక్షులు కృష్ణ, ప్రధాన కార్యదర్శి జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



## వేసవి శిబిరం విజయవంతంగా ముగింపు

**కొడకండ్ల,తెలంగాణ చౌరస్తా:**

జనగాం జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని తెలంగాణ పీఎం శ్రీ ఆదర్శ పాఠశాలలో 99 రోజుల తెలంగాణ ప్రభుత్వం ప్రజాపరిపాలన ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మే 11న మొదలైన 6వ, తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు ఆట పాటలు,సంస్కృతిక,పర్యావరణ పరిరక్షణ, యోగ లాంటి అనేక కార్యక్రమాలతో విద్యార్థులలోని నైపుణ్యాలను వెలికి తీయడానికి పాఠశాల ప్రిన్సిపల్ ఏ.భానుప్రసాద్ ఆధ్వర్యంలో పిడి J.సుధాకర్, యోగా శిక్షకుడు డీ.సోమయ్య సహాయసహకారాలతో 15 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## సుల్తానాబాద్ ను సుందరీకరణంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ఎమ్మెల్యే దాసరిదే

- **పదేండ్ల కేసీఆర్ పాలనలో సుల్తానాబాద్ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశాం**
- **మాజీ ఎమ్మెల్యే దాసరి నేతృత్వంలో పట్టణానికి రూ.19 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులను పూర్తి చేశాం.**
- **ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే.. వ్యక్తిగత దూషణలా..?**
- **మాజీ ఎమ్మెల్యే దాసరిపై ఆరోపణలు చేస్తే ఊరుకోం..**
- **సుల్తానాబాద్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఎండి వహీద్**



**సుల్తానాబాద్, తెలంగాణ చౌరస్తా:**

పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పాలనలో సుల్తానాబాద్ పట్టణానికి వేల కోట్ల రూపాయలతో నిధులు మంజూరు చేయించి, పట్టణాన్ని అన్ని రంగాల్లో సుందరీకరణంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి దేనని సుల్తానాబాద్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ఎండి వహీద్ స్పష్టం చేశారు.సోమవారం స్థానిక బీఆర్ఎస్ యూత్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. గతంలో పెద్దపల్లి ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ప్రజలకు సేవలందించిన దాసరి మనోహర్ రెడ్డిపై అధికార పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలు కాంగ్రెస్ నాయకుల దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. సుల్తానాబాద్ పట్టణానికి గత బీఆర్ఎస్ హయాంలోనే రూ. 19 కోట్ల నిధులు మంజూరు చేయించి, పలు అభివృద్ధి పనులను పూర్తి చేశామని తెలిపారు. పట్టణంలో రూ.3 కోట్ల సిడిపి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ. 5 కోట్ల నిధులతో 35 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, సుల్తానాబాద్ పట్టణం నుండి వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై బీటీ రోడ్ల నిర్మాణం, పట్టణంలోని పలు కూడళ్లలో హైమాస్ట్ లైట్లు, రూ. 11 కోట్ల టియుఎఫ్ఐడిసి నిధులతో పలు అభివృద్ధి పనులతో మాజీ ఎమ్మెల్యే దాసరి సారథ్యంలోనే సుల్తానాబాద్ పట్టణం అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం యూత్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. వానాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వరి ధాన్యం, మక్క పంటలను త్వరగా తూకం వేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రస్తావిస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే తన అనుచరులతో రోజుకో ప్రెస్ మీట్ పెడుతూ.. రాజకీయ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలోని రైతులు కొనుగోళ్ల సమస్యలతో బాధపడుతుంటే ప్రజల పక్షాన ప్రశ్నిస్తే మాజీ ఎమ్మెల్యే దాసరిపై వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రస్తుత ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం తరలింపుకు సరిపడా లారీలను సమకూర్చి, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని బీఆర్ఎస్ యూత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు ఆరేపల్లి ప్రశాంత్, ఎండి సల్మాన్, చిటికెల పరమేష్, కందుకూరి కిరణ్, మైనారిటీ యూత్ ప్రెసిడెంట్ ఎస్.కే షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం అన్నదాతకు తీరని నష్టం

- **తడిసిన ధాన్యం, మక్కలు**
- **ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల డిమాండ్**



**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో మధ్యాహ్నం కూర్చిన వర్షానికి వ్యవసాయ మార్కెట్లో పోసిన ధాన్యం, మక్కలు తడిసి తీవ్ర నష్టం కలిగిందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్కాలం కష్టపడి, శ్రమ చేసి పండించిన పంట వర్షం పడడం ద్వారా అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.తడిసిన ధాన్యాన్ని, మక్కలను ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్ చేశారు.

## వీఓఏల సమ్మెకు ఏఐటీయూసీ పూర్తి మద్దతు


- **గ్రామ దీపికల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి**
- **ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా నాయకులు మంకెన కృష్ణ**

**ఏన్కూర్, తెలంగాణ చౌరస్తా:**

ఏన్కూరు మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న వీఓఏల దీక్షా కార్యక్రమానికి ఏఐటీయూసీ పూర్తి మద్దతు ప్రకటించింది.గ్రామ దీపికల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా నాయకులు మంకెన కృష్ణ డిమాండ్ చేశారు.సోమవారం ఏన్కూరు మండల కేంద్రంలోని దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన, సమ్మెలో పాల్గొంటున్న వీఓఏలకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా మంకెన కృష్ణ మాట్లాడుతూ... గ్రామ స్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తున్న వీఓఏలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారు చేస్తున్న పనికి తగిన గౌరవ వేతనం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీఓఏలకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వడంతో పాటు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన సందర్భాల్లో రూ.20 లక్షల ప్రమాద బీమా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే వీఓఏలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు సమాచారం అందించడం వంటి కీలక బాధ్యతలను వీఓఏలు నిర్వహిస్తున్నారు.అయితే వారికి సరైన వేతనం, భద్రతా సౌకర్యాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలి అని మంకెన కృష్ణ పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ దీక్షలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన వీఓఏలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వీఓఏ జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షులు జంపాల రమేష్, ఏన్కూరు మండల ప్రధాన కార్యదర్శి గోరంట్ల చంద్రావతి, మండల ఉపాధ్యక్షులు బందులు శాంతారావు తదితరులతో పాటు మండలంలోని అన్ని గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ...వీఓఏల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తమ సంఘం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు

## మహిళలను కోటేశ్వరులను ప్రభుత్వ లక్ష్యం

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**



కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలో సోమవారం నూతన మహిళా స్వశక్తి భవన నికి మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టమన్నారు. కోటి మంది మహిళలను కోటేశ్వరులను కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు . ఈ కార్యక్రమంలో పురుషోత్తం భాగ్య రవీందర్, ఉప సర్పంచ్ కడెం మహేష్,కార్యదర్శి భాగ్యలక్ష్మి,ఏ.ఈ. పవన్ కుమార్ ఏపీఎం లవ కుమార్ ,వార్డ్ సభ్యులు లక్ష్మీనారాయణ, గీస రాజయ్య, మచ్చ సంపత్, గుంటి సుశీల, పురుషోత్తం అనిత, తదితరులు పాల్గొన్నారు.






# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

- **సమగ్ర చట్టం రూపొందించి,పకడ్బందీగా అమలు చేయాలి**
- **విద్య వ్యాపారాన్ని నిర్మూలించి,ఉచిత నాణ్యమైన విద్యను అందించాలి**

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్,కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టం రూపొందించి, పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి యస్ యు) ప్రగతిశీల యువజన సంఘం (పి వై ఎల్) ప్రగతిశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యూ) సంఘాల ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనుకు వివిధ డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పిఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయలక్ష్మి,పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ,పి డి యస్ యు జిల్లా అధ్యక్షులు వెంకటేష్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ (స్కూల్స్ & కాలేజ్) విద్యాసంస్థల యాజమాన్యాలు సామాన్య, మధ్యతరగతి ప్రజల అమాయకత్వాన్ని,ఆశలను,ఆసరాగా చేసుకుని అడ్డు అదుపు లేకుండా,రకరకాల పేర్లతో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యారంగాన్ని వ్యాపారమయంగా మార్చి వేస్తున్నారని మండిపడ్డారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం,ప్రైవేటు విద్యాసంస్థలు వసూలు చేస్తున్న ఫీజుల భారాన్ని మోయలేక ఉన్న కొద్దిపాటి ఆస్తిపాస్తులను సైతం అమ్ముకుంటూ ఆర్థికంగా,మానసికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కొన్ని ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి అదనపు సెక్షన్లు,బ్రాంచ్ లను నెలకొల్పుకుంటున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా వారి ఫీజుల దోపిడీకి కొమ్ముకాస్తున్నారని తెలిపారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ నుండి ప్రజలను రక్షించాలని కోరారు.జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో పేద,మధ్యతరగతి వర్గాల ప్రజలు ఫీజుల భారంతో ఆర్థికంగా చితికిపోతున్న విషయాలు కోకొల్లలనీ దీనిపై ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు తెచ్చిన ఏ మార్పు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఉన్నత అధికారులు చొరవ తీసుకొని ఫీజుల భారం నుండి ప్రైవేట్ కార్పొరేట్ల కబంధహస్తాల్లో చిక్కుకున్న తల్లిదండ్రులకు త్వరలోనే విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు జే.రాము,పి.మధు,యం.రాజు, పిడిఎస్యు జిల్లా సహాయ కార్యదర్శి రాజు,నవనీత,శ్రీకాంత్,పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి,సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభం

- **ఎమ్మెల్యే మందుల సామేల్**

**నూతనకల్, తెలంగాణ చౌరస్తా**



నూతనకల్ మండల పరిధిలోని పెదనెమిల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాన్ని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ , కాంగ్రెస్ నాయకులు జన్నారెడ్డి వివేక్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ సంఘం సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ నాయకులు కాసోజు మధన్ చారి, నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, పెదనెమిల గ్రామ సర్పంచ్ సురకంటి లావణ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మస్కాపురం వెంకన్న, చిప్పలపల్లి రాంబాబు, బొల్క స్రవంతి, బొల్క చంద్రయ్య, సోమిరెడ్డి మల్లారెడ్డి, పసుల యాదగిరి, కాసోజు ఉపేందర్, సామ రాజశేఖర్ రెడ్డి, కాసోజు మధు, చిప్పలపల్లి సందీప్, గుర్రం వెంకన్న, బొబ్బ సాయి రెడ్డి, కనకం వెంకన్న, కనకం శ్రీనివాస్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## రేపల్లెవాడలో మహిళా భవన నిర్మాణానికి శ్రీకారం

- **గ్రామీణ మహిళల అభివృద్ధికి ప్రత్యేక వేదికగా 'స్త్రీ శక్తి భవనం'**

**ఏన్కూర్, తెలంగాణ చౌరస్తా:**



ఏన్కూర్ మండలంలోని రేపల్లెవాడ గ్రామంలో మహిళల సంక్షేమం, స్వయం ఉపాధి అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నిర్మించనున్న స్త్రీ శక్తి భవనానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, పీఆర్ ఏఈ సూర్యనారాయణ,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్‌లు భవన నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. గ్రామ మహిళలకు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ భవనం ఉపయోగపడనుంది.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ...మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.గ్రామీణ ప్రాంత మహిళలు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, వివిధ రంగాల్లో శిక్షణ పొందేందుకు ఈ భవనం కేంద్రంగా మారుతుందని తెలిపారు.మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇవ్వడం, సంఘాల కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడం వంటి కార్యక్రమాలకు ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు, గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయి. అందుకే మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.భవన నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేస్తాం అని అధికారులు తెలిపారు.స్థానిక మహిళా సంఘాల సభ్యులు ఈ భవనం నిర్మాణంపై ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు సమావేశాలు నిర్వహించేందుకు సరైన స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కొత్త భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత విస్తృతమవుతాయన్నారు.గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లెవాడ సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు నిమ్మల నరేందర్, భువనేశ్వర్ రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వరరావు, నాయకులు సాయిన్ని వీరబాబు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట రైస్ మిల్లులో మద్యం దందా

- **తిరుపతిరావు' మురళి' మధ్యలో మద్యం దందాపై 'తెలంగాణ చౌరస్తా' స్పెషల్ ఫోకస్**
- **అధికారులారా ఎర్రగుంట వైపు జరా చూడండి**
- **అధికారులు నిమ్మకు నీరెత్తినా.. 'మురళి' తిరుపతిరావు మద్యం దందా ఆగదా**
- **ఇంటెలిజెన్స్ నిఘా శూన్యం.. స్థానిక అధికారుల మౌనం**
- **ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సిండికేట్ మాఫియా**



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపరెడ్డిపల్లి మండలం ఎర్రగుంట గ్రామం వేదికగా అక్రమ మద్యం సిండికేట్ దందా రోజురోజుకూ శృతిమించుతోంది. ' తిరుపతిరావు,మురళి' అనే ఇద్దరూ వ్యక్తికనుసన్నల్లో ఒక రైస్ మిల్లు అడ్డాగా సాగుతున్న ఈ నయా మాఫియాపై స్థానిక అధికారులు కళ్ళున్నా కపట నిద్ర నటిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, నిబంధనలను తుంగలో తొక్కుతూ పల్లెపల్లెకూ మద్యం పంపిణీ చేస్తున్నా.. నిఘా వర్గాలు (ఇంటెలిజెన్స్) సైతం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న మర్మమేంటని ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. అధికారుల మౌనం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం! గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులను నిర్మూలించాల్సిన ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు ఎర్రగుంట వైపు రావడానికే భయపడుతున్నారా? లేక తిరుపతి రావు మురళి సిండికేట్ ఇస్తున్న 'మామూళ్ల' మత్తులో జోగుతున్నారా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. నిత్యం వందలాది లీటర్ల మద్యం రైస్ మిల్లు నుంచి పల్లెల్లోకి సరఫరా అవుతుంటే అధికారులు కనీసం తనిఖీలు కూడా చేయకపోవడం చూస్తుంటే, స్థానిక యంత్రాంగం ఈ మాఫియాకు పూర్తిగా మోకరిల్లిందా అనే సందేహాలు వస్తున్నాయి. అధికారుల ఈ ఉదాసీనత స్థానిక ప్రజల ప్రాణాలతో, కుటుంబాల ఆర్థిక స్థితిగతులతో చెలగాటమాడటమేనని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి.

**నిఘా నేత్రం ఏమైంది? ఇంటెలిజెన్స్ నిర్లక్ష్యంపై ప్రశ్నలు!**

జిల్లాలో చిన్న చిన్న సంఘటనలపైనా నివేదికలు ఇచ్చే ఇంటెలిజెన్స్ నిఘా విభాగం విభాగానికి, ఎర్రగుంటలో ఇంతపెద్ద ఎత్తున సాగుతున్న సిండికేట్ సామ్రాజ్యం ఎందుకు కనిపించడం లేదు? ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఇక్కడి వాస్తవాలను చేరవేయడంలో ఇంటెలిజెన్స్ ఎందుకు విఫలమైంది? మురళి నెరిపిన చాణక్య దౌత్యానికి నిఘా నేత్రాలు కూడా మూతపడ్డాయా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

**గ్రామాల్లో చిచ్చు పెడుతున్న 'బెల్ట్' భాగోతం..**

మురళి నేతృత్వంలో సాగుతున్న ఈ అక్రమ మద్యం సరఫరా వల్ల అన్నపరెడ్డిపల్లి మండలంలోని పల్లెలు మద్యం మత్తులో ఊగుతున్నాయి. యువత పెడదోవ పడుతోంది. పచ్చని సంసారాల్లో మద్యం చిచ్చు రేపుతోంది. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నా, స్థానిక పోలీస్ యంత్రాంగం తిరుపతిరావు. మురళి దందాను అడ్డుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున రాజకీయ, అధికార పక్షాల హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**జిల్లా కలెక్టర్, ఎస్పీ యాక్షన్ లోకి దిగాలి!**

స్థానిక అధికారులు తిరుపతిరావు మురళితో చేతులు కలిపిన వేళ.. ఇక జిల్లా ఉన్నతాధికారులే ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఎర్రగుంటలో అసలు ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ నేరుగా ప్రత్యేక బృందాలతో (టాస్క్‌ఫోర్స్) దాడులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. రైస్ మిల్లు కేంద్రంగా సాగుతున్న ఈ సిండికేట్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసి, తిరుపతిరావు.మురళితో పాటు అతనికి సహకరిస్తున్న స్థానిక అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని 'తెలంగాణ చౌరస్తా' ప్రతినిధి ద్వారా గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్ల సీజ్

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా:**


సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో గల చెరువు నుంచి అనుమతి లేకుండా ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్న ఆరు టిప్పర్లను పెద్దపల్లి రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఉప తహశీల్దార్ విజేందర్ జిల్లా కేంద్రంలో 21 టిప్పర్లను తనిఖీ చేయగా, కేవలం 16 వాహనాలకే వేబిల్లులు ఉన్నట్లు తేలింది. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్న మిగిలిన 6 టిప్పర్లను అధికారులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

# అశ్వారావుపేట బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరవు

- **దాతలు ఇచ్చిన ఫ్యాన్లు ఉన్నా.. తిప్పలేని దుస్థితిలో ఆర్టీసీ యాజమాన్యం**
- **మినీ డిపో' హామీలు నీటి మూటలేనా..?**
- **ఉక్కిరిబిక్కిరి అవుతున్న పసిపిల్లలు,ప్రయాణికులు**






**అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:**

భగభగ మండుతున్న భానుడి భీభత్సానికి తోడు, అధికారుల ఘోర నిర్లక్ష్యం తోడవ్వడంతో అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులకు ఒక నరకకూపంగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న కీలకమైన జంక్షన్ కావడంతో ఈ బస్టాండ్ గుండా ప్రతిరోజూ రెండు రాష్ట్రాలకు చెందిన వందలాది ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు వేలాది మంది ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాంతంలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ యాజమాన్యం, స్థానిక యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యాయి. మే నెల ఎండలు ముదురుతుండటంతో ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగాయి.ఇలాంటి పరిస్థితుల్లో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు కనీసం ఐదు నిమిషాలు కూర్చుందామన్నా గాలి ఆడక, చెమటలు కక్కుతూ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా పసిపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.

**దాతలు ఇచ్చిన ఫ్యాన్లకూ రిపేర్లు చేయలేని దైన్యం**

ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు విసనకర్రలైనా అందజేస్తుందో లేదో కానీ, స్థానిక దాతలు మానవత్వంతో బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. అయితే, కనీసం ఆ ఫ్యాన్లు తిరుగుతున్నాయా? లేదా? అని చూసే నాథుడే కరువయ్యాడు. ప్రస్తుతం ఆ ఫ్యాన్లు రిపేరుకు గురై మూలనపడినా, వాటిని బాగు చేయించేందుకు కూడా ఆర్టీసీ అధికారుల వద్ద సొమ్ముల్లేవా? లేక అంతటి నిర్లక్ష్యమా? అని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. చల్లటి తాగునీటి సదుపాయం కూడా లేకపోవడంతో, ప్రయాణికులు ఎండ తీవ్రతకు తట్టుకోలేక ప్రైవేట్ షాపుల్లో డబ్బులు పెట్టి నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. రెండు రాష్ట్రాల సరిహద్దు కేంద్రమైన బస్టాండ్‌ను ఇంతలా గాలికొదిలేసిన యాజమాన్యాన్ని అసలు ఏం చేయాలో కూడా అర్థం కావడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**మాటల కోటలు.. చేతల్లో శూన్యం**

ఎన్నికల సమయంలోనో, సభల్లోనో వేదికలెక్కితే చాలు అశ్వారావుపేటను 'మినీ డిపో' చేస్తామంటూ స్థానిక రాజకీయ నాయకులు నోటికొచ్చిన హామీలు గుప్పించడం అలవాటుగా మారిందని ప్రయాణికులు మండిపడుతున్నారు. మినీ డిపో మాట దేవుడెరుగు.. ఉన్న బస్టాండ్‌లో కనీస మౌలిక వసతులు, గాలి, నీరు కల్పించలేని ఈ ప్రభుత్వం, ఇక్కడి నాయకులు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. ఓట్ల కోసం వచ్చే నాయకులకు సరిహద్దు ప్రాంత ప్రయాణికుల, స్థానిక ప్రజల కష్టాలు పట్టవా అని స్థానికులు నిలదీస్తున్నారు.

**రాసేవాళ్లు రాస్తూనే ఉంటారు.. మా పని ఇంతేనా.**

బస్టాండ్ సమస్యలపై పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా, మీడియా ఎంత మొత్తుకున్నా స్థానిక అధికారుల్లో కనీస చలనం లేకపోవడం అత్యంత శోచనీయం. "వార్తలు రాసేవాళ్లు రాసుకుంటారు.. మా పని ఇంతే.. మేం మారం" అనే మొండి ధోరణిలో అధికారులు వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. రెండు రాష్ట్రాల ప్రయాణికులు వచ్చిపోయే ఇంతటి కీలకమైన బస్టాండ్‌ను ఇలా నరకప్రాయంగా మార్చడం సిగ్గుచేటు. ఏసీ గదుల్లో కూర్చునే అధికారులకు, బస్టాండ్‌లో ఉక్కపోతతో అల్లాడుతున్న పసిపిల్లల రోదనలు వినిపించడం లేదా? ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ఆర్టీసీ యంత్రాంగం తక్షణమే నిద్ర మత్తు వదిలి స్పందించాలి. దాతలు ఇచ్చిన ఫ్యాన్లను యుద్ధప్రాతిపదికన రిపేర్ చేయించి, తాగునీటి వసతి కల్పించాలి. లేనిపక్షంలో ప్రజల, ప్రయాణికుల నుంచి తీవ్ర నిరసనలు తిరుగుబాటు రానున్నట్లుగా తెలుస్తుంది